

## జులై 31 వరకు వర్షాలు లేకపోతే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత



**దశ, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లాలో జులై 31, 2026 నాటికీ తగిన వర్షపాతం నమోదు కాకపోతే రైతులు నష్టాలను తగ్గించుకునేందుకు, అందుబాటులో ఉన్న తేమను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ సూచించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి ఎం. సుజాత రైతులకు పలు సూచనలు చేశారు. వరి సాగు చేయలేని ప్రాంతాల్లో టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు, కాకర, బీరకాయ, వంకాయ, ఆకుకూరలు వంటి కూరగాయలతో పాటు ఆయిల్ పామ్, పండ్ల తోటలు, పూల సాగు చేపట్టవచ్చని తెలిపారు. అలాగే మొక్కజొన్న + కంది లేదా కంది + జొన్న (1:4) అంతర పంట విధానాన్ని అనుసరించాలని సూచించారు. జొన్న సాగు సాధ్యం కాని మిగులు విస్తీర్ణంలో ఉలవలు సాగు చేయవచ్చని, ఇందుకు అవసరమైన విత్తనాలు రైతుల వద్దే అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

మొక్కజొన్న సాగుకు అనుకూల పరిస్థితులు లేకుంటే ఆముదం, చిరుధాన్యాలు, కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. ఈ పంటలకు అవసరమైన విత్తనాలు గుర్తింపు పొందిన విత్తన విక్రేతల వద్ద లభ్యమవుతాయని తెలిపారు. పత్తి సాగు సాధ్యం కాని ప్రాంతాల్లో అలసంద, మేత జొన్న (ఫోడర్ జోవార్), స్వల్పకాలిక కంది రకాలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ సూచించింది. అలసంద, కంది విత్తనాలు విత్తన డీలర్ల వద్ద అందుబాటులో ఉండగా, మేత జొన్న విత్తనాలను పశుసంవర్ధక శాఖ 75 శాతం రాయితీపై పంపిణీ చేస్తోందని వెల్లడించింది. రైతులు తమ వద్ద ఉన్న స్వంత విత్తనాలను కూడా వినియోగించుకోవచ్చని సూచించింది. అలాగే స్వల్పకాలిక కంది రకాల సాగును ప్రోత్సహిస్తున్నామని, వాటి విత్తనాలు కూడా విత్తన డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, విత్తనాలు, సాగు విధానంపై మరిన్ని వివరాల కోసం రైతులు తమ మండల వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం. సుజాత సూచించారు.

## యువత క్రీడల్లో రాణించాలి: సీఐ భూపాల్ శ్రీధర్

*నాయకులు గొల్లగూడెం సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ*




**దశ, చేవెళ్ల:** యువత క్రీడల్లో రాణించాలని చేవెళ్ల పోలీస్ స్టేషన్ సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. చేవెళ్ల మండలంలోని తంగడపల్లి గ్రామంలో జిబిఆర్ క్రికెట్ టోర్నమెంటును నిర్వహించారు. ముగింపు వేడుకలకు సీఐ భూపాల్ శ్రీధర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల్లో రాణించి వారి ప్రతిభ చాటుకోవాలన్నారు. యువతను ప్రోత్సహించి ఇలాంటి టోర్నమెంట్ ను నిర్వహిస్తున్న నిర్వాహకులు గొల్లగూడెం సుధీర్ రెడ్డిని సీఐ అభినందించారు. ఈ టోర్నమెంటులో మొత్తం ఐదు జట్లు తలపడగా, షౌకత్ జట్టు ప్రథమ బహుమతిని, నరేందర్ జట్టు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నాయి. ప్రథమ బహుమతితో విజేతగా నిలిచిన జట్టుకు రూ.15,000, ద్వితీయ బహుమతితో రన్నరప్ గా నిలిచిన జట్టుకు రూ.10,000లను సీఐ చేతుల మీదుగా అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పామెన రాములు, ఉప సర్పంచ్ గోవర్ధన్, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నాగోల్ సర్కిల్‌లో ట్రేడ్ లైసెన్సుల గుట్టు ?.. వేల వ్యాపారాలు అధికారుల కళ్ల ముందే!

- *లైసెన్సులు లేకుండానే వ్యాపారాలు.. పర్యవేక్షణలో ఘోర వైఫల్యమా?*
- *ఆదాయం వసూలే లక్ష్యమా.. అక్రమాల నియంత్రణ లేదా?*



**దశ, పెద్ద అంబర్ పేట :** మేడ్చల్-మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్‌లో ట్రేడ్ లైసెన్సుల వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి వ్యాపార సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉండగా, వేలాది దుకాణాలు, గోదాములు, వాణిజ్య సంస్థలు ఎలాంటి లైసెన్సులు లేకుండానే కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల నకిలీ ఆహార పదార్థాలు, కల్తీ మసాలాలు, నకిలీ కూల్‌డ్రింక్స్, గడువు ముగిసిన వస్తువులు, నకిలీ కాస్మొటిక్స్, అనుమతులు లేని గోదాములు వరుసగా బయటపడుతున్నా.. సంబంధిత అధికారులు ముందస్తు తనిఖీలు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాడులు జరిగిన తర్వాతే అక్రమాలు బయటపడుతుండటం అధికారుల పర్యవేక్షణ వైఫల్యానికి నిదర్శనమా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ట్రేడ్ లైసెన్సుల జారీ, పునరుద్ధరణ, తనిఖీల బాధ్యత వహించాల్సిన అధికారులు ఆదాయం వసూలులో చురుకుగా ఉంటూ, అక్రమ వ్యాపారాలను గుర్తించడంలో మాత్రం విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు ఇవే..**

నాగోల్ సర్కిల్‌లో మొత్తం ఎన్ని ట్రేడ్ లైసెన్సులు జారీ అయ్యాయి?

లైసెన్సులు లేకుండా ఎన్ని వ్యాపారాలు నడుస్తున్నాయి?

ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు నిర్వహించారు?

ఎన్ని నోటీసులు జారీ చేశారు?

ఎన్ని సంస్థలపై చర్యలు తీసుకున్నారు?

ఈ వివరాలను ప్రజలకు బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ వ్యాపారాలు వెలుగులోకి వచ్చిన తర్వాత హడావుడిగా దాడులు చేయడం కంటే, ముందుగానే అక్రమాలను అరికట్టే వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. నాగోల్ సర్కిల్‌లో సమగ్ర సర్వే నిర్వహించి, ట్రేడ్ లైసెన్సులు లేని వ్యాపారాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## సోయం రాజబాబుకు మెచ్చా నాగేశ్వరరావు నివాళి

**దశ, దమ్మపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల నాయకుడు సోయం రాజబాబు గుండెపోటుతో అకాల మరణం చెందడంతో అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ (మాజీ టీఆర్ఎస్) నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం కొమ్ముగూడెంలోని రాజబాబు నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, సోయం రాజబాబు ప్రజల మనిషిగా గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. పార్టీ బలోపేతానికి, గ్రామ ప్రజల సేవకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. రాజబాబు అకాల మరణం పార్టీతో పాటు గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

రాజబాబు కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధారా యుగేందర్, పెద్దగొల్లగూడెం సర్పంచ్ యాట్ల రాందాస్, నారం రాజశేఖర్, గాజుబోయిన ఏసుబాబు, రావుల శ్రీను, జలగం వాసు, అబ్దుల్ జిన్నా, రామకృష్ణ, చీకటి రామయ్య, యార్లగడ్డ శ్రీను, భరత్, గుమ్మడపు విష్ణు, మండవ సత్య, బాల శ్రీను, సున్నం రాము, వెలుగోటి మహేష్, తోలేం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



- *ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో యూనిఫాంలు, పుస్తకాల దందా అరికట్టాలని విజ్ఞప్తి*
- *ఎంఈవోకు వినతిపత్రం అందజేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన నేత ముత్యాల మనీష్ పటేల్*

**దశ, ఇబ్రహీం పట్నం :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో యూనిఫాంలు, పుస్తకాల పేరుతో జరుగుతున్న అక్రమ దందాను అరికట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో)ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు ముత్యాల మనీష్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈవో కార్యాలయంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలో అనుమతులు లేకుండా నడుస్తున్న కొన్ని ప్రైవేట్ పాఠశాలల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపే విధంగా ఒకే దుకాణాల్లో యూనిఫాంలు, పుస్తకాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి అక్రమాలను అరికట్టి, విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని ఎంఈవోను కోరారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించడంతో పాటు తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంఈవో హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుంది: డా. బూర నర్సయ్య

**దశ, యాదాద్రి భువనగిరి,:** భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రను మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వడపర్తి నుంచి చీకటిమామిడి వరకు రహదారి నిర్మాణం రెండేళ్లుగా పెండింగ్‌లో ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ రహదారిని వెంటనే పూర్తి చేయడంతో పాటు చీకటిమామిడి-చౌదరిపల్లి కొత్త రహదారి, కీసర ORR నుంచి తుర్కపల్లి వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. జిల్లాలో దెబ్బతిన్న అన్ని రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని అన్నారు.





రైతుల ప్రయోజనాల దృష్ట్యా శామీర్‌పేట చెరువు నుంచి బొమ్మలరామారం మండలానికి సాగునీరు అందించే శాశ్వత ప్రణాళికను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ విద్యార్థుల ఉన్నత విద్య కోసం బొమ్మలరామారం మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, పేదలకు కేటాయించిన భూములకు వెంటనే పట్టాదారు పాస్‌బుక్లు అందజేసి పూర్తి హక్కులు కల్పించాలని కోరారు.

అన్యాక్రాంతమైన దేవాదాయ భూములను స్వాధీనం చేసుకుని రక్షించాలని, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్న కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు కనీసం 50 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేయాలని కోరారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని డా. బూర నర్సయ్య గౌడ్ హెచ్చరించారు. ప్రజల హక్కులు, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి, గ్రామీణాభివృద్ధి కోసం బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి అశోక్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కసం వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్‌రెడ్డి, పాశం భాస్కర్, ఆలె చంద్రశేఖర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురి, మాయ దశరథ్, పక్కిర్ రాజేందర్, మండల అధ్యక్షులు చిర్కా సురేష్, మలోత్ వినోద్, బలరామ్‌తో పాటు జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. లెక్చరర్ మృతి

- *వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొని పరార్.. కేసు నమోదు*



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో సోమవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా లెక్చరర్ దుర్మరణం చెందారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామానికి చెందిన కందకట్ల వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆయన బంధువు రిక్కాల నరేందర్‌రెడ్డి భార్య ఎల్లోల శ్రావణి రెడ్డి (34) అబ్దుల్లాపూర్‌మెట్‌లోని కేఎన్ఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

సోమవారం విధులు ముగించుకుని తన స్కూటీ (TG07G4499)పై ఇంటికి వెళ్తుండగా, ఎన్‌హెచ్ 65పై ఓఆర్ఆర్ వంతెన సమీపంలోని సంపూర్ణ హోటల్ ఎదురుగా వెనుక నుంచి అదే దిశలో వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఆమె స్కూటీని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆమె రోడ్డుపై పడిపోగా, వాహనం ఆమె తలపై నుంచి వెళ్లి అక్కడి నుంచి పరారైంది.

ఈ ప్రమాదంలో శ్రావణి రెడ్డికి తల, ఛాతీ, మెడ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (ఓజీహెచ్) మార్చురీకి తరలించారు.

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు. సమీపంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ పరారైన వాహనం కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

## మల్లాపూర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన..పోతగాని గోపాల్ గౌడ్



**దశ, ఓయూ:** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ డివిజన్ పరిధిలో పలు పోలింగ్ బూత్‌లలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను బీజేపీ బీఎల్ఏ1 పోతగాని గోపాల్ గౌడ్ సోమవారం పరిశీలించారు. బూత్‌ల వద్ద జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ, ధృవీకరణ ప్రక్రియపై బీఎల్‌వోలను అడిగి తెలుసుకుని, కార్యక్రమం నిర్వహణపై వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు సుశీల, సుజాత, సబితా యాదవ్, కె. యాదగిరి, రాజిరెడ్డి, బీఎల్‌వోలు, స్థానిక ఓటర్లు పాల్గొన్నారు.

## నాచారంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు




**దశ, ఓయూ:** నాచారం 21వ డివిజన్ పరిధిలోని ఓల్డ్ విలేజ్ ఎంపీపీఎస్ (MPPS) పాఠశాల వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ (ఎస్ఐఆర్) హెల్ప్‌డెస్క్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సూచనల మేరకు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బండారం శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో, నాచారం 21వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతలకంటి రాజు సమీక్షలో హెల్ప్‌డెస్క్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, సవరణలు అవసరమైన ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను వినియోగించుకుని దరఖాస్తు ఫారాలను సక్రమంగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని కోరారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడానికి ఈ హెల్ప్‌డెస్క్ ఉపయోగపడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## చెడుస్నేహాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: ఎస్ఐ ఉషారాణి



**దశ, మంచిర్యాల:** యువత చెడుస్నేహాలు, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంచిర్యాల షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి సూచించారు. మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన షీ టీమ్స్ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలో, బయట బాలికలను ఎవరైనా వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా లేదా భయాందోళనలకు గురిచేసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల జ్ఞాపకశక్తి తగ్గిపోవడంతో పాటు కేంద్ర నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని, ఫలితంగా వ్యక్తి తన ఆలోచనలు, ప్రవర్తనపై నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటుందని వివరించారు. మత్తు పదార్థాల వినియోగం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, అలాంటి కేసుల్లో అరెస్టయితే బెయిల్ పొందడం కూడా కష్టమవుతుందని చెప్పారు. విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకుని చదువుపై దృష్టి సారించాలని, ఎవరైనా డ్రగ్స్ లేదా ఇతర చెడు వ్యసనాలకు ప్రోత్సహిస్తే వెంటనే పోలీసులకు లేదా ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్స్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'సర్' కార్యక్రమాన్ని పరిశీలించిన మహిళా కాంగ్రెస్ నాయకులు

**దశ, మహాదేవ పూర్:** (జూలై 20) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో కొనసాగుతున్న " సర్ " కార్యక్రమాన్ని సోమవారం మహిళా కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనివాస్ బాబు ఆదేశాల మేరకు డీ సీ సీ ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, మహాదేవపూర్, ఏడపల్లి, కుదురుపల్లి గ్రామాలలో "సర్" కార్యక్రమంలో భాగంగా ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించి, తగు సూచనలు చేశారు.

గ్రామాలలో 90 శాతం పైగా నమోదు కార్యక్రమం జరగగా కుదురుపల్లి 173 బూతులో ఓటు నమోదు 100% పూర్తి చేసిన సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి బి ఎల్ ఎ కోట సమ్మయ్య, బి ఎల్ ఓ కుమ్మరి సారయ్య, కారోబార్ జిముడ రాజబాబు లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పక్షాన కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిరుమల సమ్మయ్య. సర్పంచ్ హసీనాబానో అక్బర్ ఖాన్, మాజీ ఎంపీపీలు బి. రాణిబాయి, బందెల సత్యమ్మ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంగోతి సుగుణ, ధర్మకర్త పద్మ, మాజీ చెర్మన్ వామనరావు, సర్పంచులు మోతే నీలారాని సాంబయ్య, చల్ల సమ్మిరెడ్డి. మాజీ ఎంపీటీసీ గంగయ్య. బి ఎల్ ఏ లు, బి ఎల్ ఓ లు పాల్గొన్నారు.

# ఆకారపు సుదర్శన్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుండాలి

**దశ, సూర్యాపేట ప్రతినిధి:** ఆకారపు సుదర్శన్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని ప్రజా సేవలో ముందుండాలని టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి బయ్య నారాయణ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఆకారపు సుదర్శన్ విగ్రహానికి ఆయన కుమారుడు, తుంగతుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆకారపు రమేష్ కుమార్ తో కలిసి 16వ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళిత కుటుంబంలో జన్మించిన ఆకారపు సుదర్శన్ తన సేవా తత్పరత, ప్రజా సంక్షేమ దృక్పథంతో విశిష్ట గుర్తింపు పొందారని కొనియాడారు. మారుమూల ప్రాంతం నుంచి ఎదిగి ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆయన చూపిన చొరవ నేటికీ ఆదర్శంగా నిలిచిందన్నారు.

ఆకారపు సుదర్శన్ తొలుత సోషలిస్టు భావజాలంతో ప్రజా ఉద్యమాల్లో పాల్గొని, అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) లో పనిచేశారని, తర్వాత తెలుగుదేశం పార్టీ తరఫున 1989, 1994 ఎన్నికల్లో సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారని గుర్తు చేశారు. 1997 నుంచి 1999 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర RTC ఛైర్మన్‌గా, 2002 నుంచి 2008 వరకు రాజ్యసభ సభ్యుడిగా సేవలందిస్తూ పలు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి నిస్వార్థంగా పనిచేసిన నాయకులు ఎప్పటికీ ప్రజల మదిలో నిలిచిపోతారన్నారు.



ఈ కార్యక్రమంలో సూర్యాపేట నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి నాతాల రాంరెడ్డి, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వెంకన్న, సూర్యాపేట రూరల్ అధ్యక్షుడు నకిరేకంటి ఉపేందర్, పెను పహాడ్ మండలం పార్టీ అధ్యక్షుడు శెట్టిపల్లి సైదులు, గోవింద చారి, కృష్ణ, ఏర్పుల లింగయ్య, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సైదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులపై అనుచిత వ్యాఖ్యలు ఊరుకోం



❖ సూర్యపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్


**దశ, సూర్యాపేట ప్రతినిధి:** ఇటీవల సరూర్ నగర్ లో బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన యువ సంగ్రామ సదస్సులో పలువురు పెయిడ్ ఆర్టిస్టులు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుల పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల సూర్యపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ మండిపడ్డారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్ర నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ లో టూ టౌన్ ఎస్ఐ గోపికృష్ణ కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 10 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించి ఉద్యోగాలు ఇవ్వకుండా నేడు నిరుద్యోగ యువతను అబద్ధపు ప్రచారాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వారి హయాంలో నోటిఫికేషన్లను ఇచ్చి పేపర్లను లీక్ చేసిన చరిత్రను యువత మర్చిపోలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఈ రెండున్నర సంవత్సర కాలంలో 70 వేల ఉద్యోగాలు ఇవ్వడాన్ని బిఆర్ఎస్ పార్టీ జీర్ణించుకోలేకపోతుందని తెలియజేశారు. దీంతో కొంతమంది పెయిడ్ ఆర్టిస్టులతో నిరుద్యోగులను రెచ్చగొట్టి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాన్ని యువత తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



## హోంగార్డుల సమస్యలను పరిష్కరించండి

❖ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ను కలిసి వినతిపత్రం అందజేసిన నేషనల్ హోంగార్డ్స్ ఆసోసియేషన్..

**దశ ఓయూ:** తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ హోంగార్డ్స్ అసోసియేషన్ రాష్ట్ర డిజిపిని కలిసి కోరింది. ఈ మేరకు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పాకాల రాజశేఖర్ సోమవారం హైదరాబాద్ లోని డీజీపీ కార్యాలయంలో సివి ఆనంద్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హోంగార్డులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీజీపీకి వివరించారు. అనంతరం పాకాల రాజశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో హోంగార్డు లకు స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ ఉత్తర్వులను అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేసి యూనిఫామ్ అలవెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే హోంగార్డులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని డిజిపి ని కోరామని వారు సానుకూలంగా స్పందించి అన్ని సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారని తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పుప్పల అశోక్, గోపాల్ నాయక్ తదితరులు ఉన్నారు.




## జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిర్సపల్లి గ్రామంలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం

**దశ, హుజురాబాద్:** సమాజంలో పేదరికాన్ని అనుభవించి కష్టపడి పైకొచ్చినవారు తాము సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని సమాజ శ్రేయస్ కోసం ఖర్చు చేసినప్పుడే సంపాదనకు సార్ధకత లభిస్తుందని జయన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుడిపాటి సరిత జయపాల్ రెడ్డి అన్నారు. మానవసేవే మాధవసేవ అనే నినాదంతో జన ఫౌండేషన్ ఆధ్వర్యంలో హుజురాబాద్ నియోజకవర్గం లో అనేక సేవ కార్యక్రమాలను విస్కృతంగా నిర్వహిస్తున్నట్లు అయన వెల్లడించారు. సోమవారం మండలంలోని సిరిసపల్లి గ్రామంలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 7 లక్షల రూపాయలతొ నూతనంగా ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పోల్సాని రామారావు అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ సభలో జయపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుకునే పేద విద్యార్థులకు అండగా నిలవడమే తమ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రభుత్వ పాఠశాల మరమ్మత్తుల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించమన్నారు. పదో తరగతి చదివే విద్యార్థిని విద్యార్థులకు పరీక్షల సమయంలో ఇబ్బంది కలగకుండా ఎక్సామ్ సమయంలో ప్యాడ్లు, పెన్నులు, పంపించడంతో పాటు వారి ఆటో చార్జీలు ఉదయం పూట టిఫిన్ ఖర్చులకు కూడా ఫౌండేషన్ భరించిందని అన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం

**దశ సూర్యాపేట ప్రతినిధి :** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం శిబిరం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 47వ వార్డు లో ఏఆర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు పాషా సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంప్ ఏర్పాటు చేసిన ఏఆర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు పాషా ని ప్రత్యేకంగా అభినందించారు. నేత్ర పరీక్షలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని, 40 సంవత్సరాలు దాటిన వారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మొరిశెట్టి లక్షాది, మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, కొనతం రాజేష్ రెడ్డి, కోడి శిరీష శివ, జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

